
పార్కులో తుప్పుపట్టి విరిగిపోయిన ఆట వస్తువులు


ఎఫ్‌సీఐ కాలనీలోని పార్కులో చెత్తా చెదారం



గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో వరద, మురుగు నీరు చేరిన దృశ్యం, కూలిన ప్రహరీ గోడ

పార్కుల నిర్వహణేదీ..?

చెత్తాచెదారంతో నిండిపోయిన ఎఫ్‌సీఐ పార్కు, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కు • తుప్పపట్టిన పిల్లల ఆట వస్తువులు

మియాపూర్/ హఫీజ్‌పేట్: మియాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ల పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, వీడియో కాలనీ, గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీల్లో పార్కులు నిరుపయోగంగా మారాయి. కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో ఆహ్లాదం అందని ద్రాక్షగా మారింది. పలు ప్రాంతాల్లో పార్కులను అభివృద్ధి చేసిన జీహెచ్‌ఎంసీ ప్రస్తుతం ఈ పార్కుల విషయంలో నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందని విమర్శలు వినిపిస్తున్నాయి. పార్కులను అభివృద్ధి చేయాలని అధికారులకు వినతిపత్రాలు ఇస్తున్నా పట్టించుకోవడం లేదంటున్నారు స్థానికులు. పచ్చదనంతో ఆహ్లాదాన్ని పంచాల్సిన పార్కులు చెత్త, చెదారంతో నిండిపోయాయి.

- మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీ, వీడియో కాలనీల్లోని పార్కులు పచ్చదనం కరువై చెత్త, చెదారంతో దర్శనమిస్తున్నాయి. కొన్నేళ్లుగా పార్కులను పట్టించుకునే వారే లేరని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎఫ్‌సీఐ కాలనీ పార్కులో చెత్త, చెదారాన్ని తొలగించి పార్కులోనే ఓ పక్క వేయడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.



- సర్వే నంబర్ 73,74లలో 23 ఎకరాల విస్తీర్ణంలో పేద, మధ్య తరగతి కుటుంబాలు ఇళ్లు నిర్మించుకున్నాయి. మౌలిక వసతుల కోసం రోడ్ల నిర్మాణంతో పాటు పార్కులకు ఖాళీ స్థలాలు కేటాయించారు. అప్పటి ఎమ్మెల్యేలు పి. జనార్దన్‌రెడ్డి, ఎం. బిక్షపతియాదవ్‌లు పార్కును అభివృద్ధి చేసి పార్కులో చిన్నారులకు కావాల్సిన ఆట వస్తువులు, కమ్యూనిటీ హాల్స్, బెంచీలు, లైట్స్ ఏర్పాట్లు చేశారు.
- ప్రస్తుతం పిల్లల ఆట వస్తువులు తుప్పుపట్టి పోవడంతో ఎప్పుడు విరిగి పోతాయోనని పిల్లలు, తల్లిదండ్రులు భయపడుతున్నారు. పిల్లలు ఆటలు ఆడడానికి వెనుకంజ వేస్తున్నారు.
- ఎఫ్‌సీఐ కాలనీ పార్కులో బోరు, కరెంట్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ బాక్స్‌లు మూతలు తెరుచుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. పిల్లలు ఎప్పుడు ప్రమాదాల బారిన పడతారోనని పిల్లల తల్లిదండ్రులు భయాందోళన చెందుతున్నారు.
- పార్కులను పట్టించుకోకపోవడంతో క్రిమికీటకాలు సంచరిస్తున్నాయ, రాత్రి వేళ్లల్లో ఆకతాయిలు, మందు బాబులు పార్కుల్లోనే మద్యం సేవిస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



చిన్నపాటి వర్షానికే చిత్తడిగా గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీ పార్కు.. కూలిన ప్రహరీ

హఫీజ్‌పేట్ పరిధిలోని గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలోని పార్కు ఇటీవల కురిసిన వర్షానికి అస్తవ్యస్తంగా తయారైంది. వరద, మురుగునీటితో నిండింది. ఇటీవల కురిసిన వర్షాలకు పార్కులో వరద నీరు భారీగా చేరడంతో వాకింగ్ ట్రాక్ మునిగింది. ప్రహరీ గోడ కూలింది. గత ఏడాది జీహెచ్‌ఎంసీ అధికారులు లక్షలాది రూపాయలతో పార్కులో అభివృద్ధి పనులు ప్రారంభించారు. కానీ ఇప్పటి వరకు కేవలం వాకింగ్‌ట్రాక్‌తో పాటు పార్కును చదును చేశారు. కాలనీలో రెండు పార్కులుండగా ఒక పార్కును కాలనీవాసులు సొంత నిధులతో అభివృద్ధి చేసుకున్నారు. ఇక యూనిసెంట్ స్కూల్ పక్కనే ఉన్న పార్కు నిరుపయోగంగా ఉంది. కాగా వర్షాలకు ఈ పార్కులో వరదనీటితో పాటు మురుగు కూడా చేరింది. కొండాపూర్‌లోని మై హోం మంగళ నుంచి ప్రేమ్‌నగర్, మార్తాండనగర్‌ల నుంచి వస్తున్న మురుగునీరు ఈ పార్కు పక్క నుంచి వెళ్తుంది. వరదకు తోడు మురుగు కూడా పార్కులో చేరింది. అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

> ### అధికారులు పట్టించుకోవాలి
>
> గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీలో లింక్ రోడ్డును ఆనుకొని ఉన్న పార్కును జీహెచ్‌ఎంసీ అధికారులు అభివృద్ధి చేయాలి. కాలనీవాసులకు పార్కులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి. ఆహ్లాదకర వాతావరణాన్ని కల్పించాలి.
>
> – శంకర్, కాలనీవాసి
>
> ### పార్కు చిత్తడిగా మారుతోంది
>
> 
>
> చిన్నపాటి వర్షం పడితే చాలు పార్కు మొత్తం చిత్తడిగా మారుతోంది. ప్రహరీగోడ కూలిపోయింది. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని పార్కులో మొక్కలు నాటి మంచి వాతావరణం కల్పించాలి. అధికారులు చర్యలు తీసుకోవాలి. – మనోజ్, స్థానికుడు




చిత్తడిగా మారిన వాకింగ్ ట్రాక్

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మైలార్‌దేవ్‌పల్లి: వివిధ విద్యుత్ మరమ్మతుల నిమిత్తం గగన్ పహాడ్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు గగన్ పహాడ్ అసిస్టెంట్ ఇంజినీర్ జుబేరుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మీనాక్షి ఫీడర్ పరిధిలోని సాతంరాయ్ ఇండస్ట్రీస్ ఏరియా, జైభవానీ ఇండస్ట్రీస్ లేన్, అన్నపూర్ణ మిల్, లియో లామినేట్స్, మధ్యాహ్నం 1.30గంటల నుంచి 3గటంల వరకు గ్రీన్ సిటీ , జల్‌పల్లి ఇండస్ట్రియల్, డ్రీమ్ ఎవెన్యూ, డ్రీమ్ మోనార్క్, లోహియా లేన్, చర్చ్‌లేన్, వెంకటేశ్వర్ కాలనీ, గోల్డ్ డ్రాప్ లేన్, మీనా కెమికల్స్ ఇండస్ట్రియల్ ఏరియా, సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్ , 3.30గంటల నుంచి 5 గంటల వరకు మెట్రో మాల్, గగన్ పహాడ్ విలేజ్ , ఆంధ్రలిక్కర్ , గోషాల, కరాచీ బేకరీ, గగన్ పహాడ్ ఇండస్ట్రీయల్ ఏరియా, పిలికాన్ లబ్బర్ లేన్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించగలరని కోరారు.

అత్తాపూర్‌లో యువతి అదృశ్యం


సైదియాబేగం (ఫైల్)

అత్తాపూర్: కుటుంబ సభ్యులతో గొడవపడి ఇంట్లో నుంచి ఓ యువతి వెళ్లిపోయిన సంఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. అత్తాపూర్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ జి. వెంకట రామిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...హసన్‌నగర్ ప్రాంతానికి చెందిన సైదియాబేగం (18) కుటుంబ సభ్యులతో కలిసి నివాసం ఉంటుంది. తండ్రి శంషుద్దీన్ ఇటీవల కాలంలోనే అనారోగ్యంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులకు వారి ఆర్థిక కారణాల వల్ల చిన్న గొడవ జరిగింది. దీంతో ఇంట్లో ఎవరికి చెప్పకుండా సైదియాబేగం వెళ్లిపోయి ఇంటికి తిరిగిరాలేదు. యువతి కోసం కుటుంబ సభ్యులు వారి బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికారు. అయినా కూడా ఆచూకీ తెలియరాలేదు. ఇంట్లో నుంచి వెళ్లిన సమయంలో సైదియాబేగం గ్రే కలర్ బుర్కా ధరించి ఉండటంతోపాటు కేవలం హిందీ మాత్రమే మాట్లగలదని కుటుంబ సభ్యులు తెలిపారు. యువతి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్విమ్మింగ్‌లో రాణిస్తే మంచి భవిష్యత్


పతకాలను అందజేస్తున్న అతిథులు

మణికొండ: చిన్నప్పటి నుంచే స్విమ్మింగ్ నేర్చుకోవటంతో పాటు జాతీయ, అంతర్జాతీయ పోటీలలో రాణిస్తే మంచి అవకాశాలు లభించి మంచి భవిష్యత్ లభిస్తుందని జాతీయ స్విమ్మింగ్ అసోసియేషన్ చైర్మన్ పి.చంద్రశేఖర్‌రెడ్డి అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, వట్టినాగులపల్లి శివారులోని డీడీ స్పోర్ట్స్ స్విమ్మింగ్ పూల్‌లో అండర్ 18 జిల్లా స్థాయి స్విమ్మింగ్ పోటీలను ఆయన ప్రారంభించి, పథకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన రాష్ట్రంలో స్విమ్మింగ్‌ను ఎక్కువ మంది క్రీడగా ఎంచుకోవటం లేదన్నారు. ఇతర రాష్ట్రాలు, దేశాలలో ఉన్నత క్రీడగా స్విమ్మింగ్‌ను ఎంచుకుని అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్నారన్నారు. పిల్లలను చిన్నప్పటి నుంచే స్విమ్మింగ్‌ను తప్పనిసరి నేర్పించటంతో పాటు క్రీడగా ఎంచుకునేలా ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు ఆనంద్, కోచ్‌లు విజయ్, సన్నీ, క్రీడాకారులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ చెక్‌పోస్టును తరలించాలి


ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ డి.జోయల్ డేవిస్‌కు వినతిపత్రం అందజేస్తున్న నరేందర్‌బాబు

బండ్లగూడ: ప్రజలకు అసౌకర్యంగా మారిన ట్రాఫిక్ చెక్‌పోస్టును ఇతర ప్రాంతాలకు తరలించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ అభ్యుదయానగర్ కాలనీకి చెందిన నరేందర్‌బాబు కోరారు. బండ్లగూడ జాగీరు చౌరస్తాలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ దగ్గర రోడ్డుపై నిర్మించిన ట్రాఫిక్ పోలీస్ చెక్ పోస్టు, ఫ్రీ లెఫ్టుకు అడ్డుగా ఉందన్నారు. దీన్ని కారణంగా అనేక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఇదే విషయాన్ని సైబరాబాద్ ట్రాఫిక్ జాయింగ్ కమిషనర్ డి.జోయల్ డేవిస్‌కు వినతిపత్రం ద్వారా అందజేశామన్నారు. ఈ సమస్యపై త్వరలోనే తాను స్వయంగా విజిట్ చేసి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారన్నారు. కొనేళ్ల క్రితం ట్రాఫిక్ తక్కువగా ఉండడంతో పాటు సిగ్నల్స్ లేని సమయంలో చెక్‌పోస్టును నిర్మించారన్నారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ట్రాఫిక్ గణనీయంగా పెరిగినందున చెక్‌పోస్టును వేరే చోటుకు తరలించాలన్నారు. హెచ్‌పి పెట్రోల్ బంక్ దగ్గర ఫ్రీ లెఫ్టును అడ్డుగా ఉన్న రహదారిని సమీక్షించి క్లీయర్ చేయాలని అవసరమైన చర్యలు తీసుకోవాలని అభ్యుదయనగర్‌కు చెందిన నరేందర్‌బాబు కోరారు. దీని వలన రోజు ప్రయాణించే వేలాది వాహనాదారులకు ఇబ్బంది పడుతున్నారన్నారు. అత్యవసరంగా ట్రాఫిక్ పోలీసులు వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు.



నగర జీవనాన్ని కాపాడటంలో కార్మికుల పాత్ర కీలకం

ఏఐటీయూసీ కార్యదర్శి జైపాల్ రెడ్డి

అత్తాపూర్: నగర ప్రజల జీవనాన్ని కాపాడడంలో కార్మికుల పాత్ర కీలకమని తెలంగాణ రాష్ట్ర మున్సిపల్, స్టాఫ్ అండ్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి వనంపల్లి జైపాల్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన సాక్షితో మాట్లాడుతూ వర్షాకాలాన్ని ఎదుర్కొనేందుకు జీహెచ్‌ఎంసీ కార్మికులు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. మున్సిపాల్ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉన్నప్పటికి ప్రాణాలను సైతం లెక్క చేయకుండా మురుగు కాల్వను శుభ్రం చేస్తున్నారన్నారు. కానీ మున్సిపల్ యాజమాన్యమే కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, గౌరవించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులు శ్రమను గుర్తించి వారికి నాణ్యమైన వేతనం, భత్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో 590 మంది పారిశుధ్య కార్మికులు పని చేస్తున్నారని చెప్పారు. పారిశుధ్య ఫీల్డ్ అసిస్టెంట్లు 33 మంది పని చేస్తున్నారని తెలిపారు. నగర ప్రజల జీవనాన్ని సజావుగా నడిచేలా శ్రమిస్తున్న వీరి కుటుంబ పరిస్థితులను గ్రహించి న్యాయమైన వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలి – కమిషనర్ ప్రదీప్‌కుమార్

మణికొండలో కొనసాగుతున్న కూల్చివేతలు


పంచవటి కాలనీలో అదనపు స్లాబులను కూలుస్తున్న సిబ్బంది

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలో తీసుకున్న అనుమతుల మేరకే నిర్మాణాలు చేపట్టాలని, ఒకవేళ అదనపు నిర్మాణాలు చేపడితే కచ్చితంగా కూల్చివేతలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ డి. ప్రదీప్ కుమార్ హెచ్చరించారు. మణికొండలో అక్రమ నిర్మాణాల కూల్చివేతల పనులు మూడు రోజులుగా కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే శనివారం మున్సిపాలిటీ పరిధిలోని పంచవటి కాలనీ, పుప్పాలగూడలోని రాఘవేంద్ర కాలనీలలో అదనపు నిర్మాణాలను కూల్చివేశారు. ఈ సందర్భంగా ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో తీసుకున్న అనుమతుల వరకే నిర్మాణాలు చేపట్టాలన్నారు. నిర్మాణానికి నిబంధనల ప్రకారం చుట్టూరా సెట్ బ్యాంక్‌లు వదలి నిర్మించుకోవాలన్నారు. అలాంటి నిబంధనలు పాటించని నిర్మాణాలను ఎప్పటికైనా కూల్చివేతలు చేపడతామన్నారు. అదనంగా నిర్మించిన భవనాలలో తక్కువకు వస్తున్నాయని కొనుగోలుదారులు తీసుకుంటే వాటితో జీవితాంతం సమస్యగానే ఉంటుందన్నారు. అలాంటి భవనాలలో కొనుగోలు చేయవద్దన్నారు. రాయదుర్గం, నార్సింగి పోలీసుల భద్రత మధ్య కూల్చివేతలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో టీపీఓ సంతోష్‌సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమానికి పాటుపడతా


ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి పూల బొకే అందజేస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్


రాష్ట్ర ముఖ్య సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిని సన్మానిస్తున్న మేయర్ లతాప్రేమ్‌గౌడ్

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసిన మేయర్ లతాప్రేమ్‌గౌడ్

బండ్లగూడ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాటుపడుతూ ప్రజలకు ఎలాంటి సమస్యలు ఎదురుకాకుండా చూస్తామని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ లతాప్రేమ్‌గౌడ్ అన్నారు. నూతనంగా మేయర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన ఆమె శనివారం తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డంప్రసాద్, రాష్ట్ర ముఖ్య సలహాదారులు వేం నరేందర్‌రెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణ రాష్ట్ర పాడి పరిశ్రమ అభివృద్ధి సంస్థ చైర్మన్ బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌తో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా మేయర్ లతాప్రేమ్‌గౌడ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలన్ని అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌ను అన్ని రంగాల్లో ముందు వరుసలో ఉంచేలా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ పూలపల్లి రాజేందర్ రెడ్డి, నాయకులు ప్రేమ్‌కుమార్‌గౌడ్, నరేందర్, సంగారెడ్డి, టింకురెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలి

చార్మినార్: తమ పరిసరాలను ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిదని పేర్కొంటూ జీహెచ్‌ఎంసీతో కలిసి ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో శనివారం ఉదయం చార్మినార్ కట్టడం వద్ద గ్రానైట్ రోడ్లను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. ఎన్‌టీపీసీ ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీ నుంచి జరుగుతున్న స్వచ్ఛతా పక్వాడా కార్యక్రమంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. చారిత్రాత్మకమైన కట్టడాల వద్ద ఎలాంటి చెత్తాచెదారం లేకుండా చూడాలని ఎన్‌టీపీసీ ఈడీ(న్యూక్లియర్) ప్రసెన్‌జిత్ పాల్ అన్నారు.

అనాథలకు పండ్ల పంపిణీ


అనాథలకు పండ్లు పంపిణీ చేస్తున్న నాయకులు

శంషాబాద్: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గుర్రం రణధీర్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా పార్టీ శ్రేణులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వాసుపత్రితో పాటు అనాథశ్రమాల్లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. రాజకీయంగా ఉన్నత పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్య క్రమంలో యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు గుంటి ప్రవీణ్‌కుమార్ (మిట్టు) నజీరుద్దీన్, సుబోద్,పాల్సన్, సంజీవ్‌రెడ్డి, నజ్ముద్దీన్, ప్రశాంత్, శ్రీనివాస్ యాదవ్, గణేష్ నాయక్, చిరంజీవిగౌడ్, ఖాజా పాషా తదితరులు పాల్గొన్నారు.


సమతాస్ఫూర్తి కేంద్రాన్ని దర్శించుకుంటున్న మధ్యప్రదేశ్ సీఎం మోహన్‌యాదవ్


సీఎం మోహన్‌యాదవ్ దంపతులకు రామానుజుల ప్రతిమను బహూకరిస్తున్న చినజీయర్‌స్వామి

సమతాస్ఫూర్తి కేంద్రాన్ని దర్శించుకున్న మధ్యప్రదేశ్ సీఎం

శంషాబాద్ రూరల్: మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్‌యాదవ్ శనివారం మండలంలోని ముచ్చింతల్ శివారులోని సమతాస్ఫూర్తి కేంద్రాన్ని సందర్శించారు. 108 దివ్య ఆలయాలు, స్వర్ణ రామానుజులను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అనంతరం శ్రీ త్రిదండి చినజీయర్ స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ సందర్భంగా అక్కడి విశేషాల గురించి వారికి సవిరంగా వివరించారు.

పరిసరాల శుభ్రతే లక్ష్యం

రాయదుర్గం: కాలనీలు, బస్తీలలో పరిశుభ్రమైన వాతావరణమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, అందుకు ప్రజలు కూడా సహకరించాలని జీహెచ్‌ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ శానిటరీ సూపర్‌వైజర్ జలంధర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం గచ్చిబౌలి డివిజన్‌లోని జర్నలిస్ట్ కాలనీ, ఎన్టీఆర్ కాలనీ, సోఫాకాలనీ, తాజ్‌నగర్ ప్రాంతాలలో చెత్తను స్వచ్ఛ ఆటోలకు అందించాలని అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోనల్ కమిషనర్ స్నేహశబరీష్, సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రజనీకాంత్‌రెడ్డి ఆదేశాలపై కాలనీలు, బస్తీలలో అవగాహన కల్పిస్తున్నామన్నారు. పలుచోట్ల రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో కొందరు చెత్తను వేస్తున్నారని అలా వేయకుండా అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రతికాలనీ, బస్తీలో చెత్త సేకరణకు రిక్షాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇంట్లోనే కాకుండా పరిసరాల్లో, కాలనీ, బస్తీల్లో రోడ్ల పక్కన, ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో సెల్ఫ్‌హెల్ప్ గ్రూప్ రిసోర్స్‌పర్సన్ పద్మజ, రాంకీ సంస్థ ప్రతినిధులు, శానిటరీ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.